క్లుప్తంగా

సారా విక్రేతల అరెస్ట్

దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి, వారి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్న దేవరపల్లి స్టేషన్ సీఐ బి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. కృష్ణంపాలెంలో సారా విక్రయిస్తున్న జక్కంశెట్టి సత్యవతిని అరెస్ట్ చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. సంగాయగూడెంలో సారా అమ్ముతున్న మల్లిపూడి కాంతమ్మను అరెస్ట్ చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. స్టేషన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సారా అమ్మకాలు, అక్రమ మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ

చాగల్లు: మండలంలోని అన్ని గ్రామాల్లో అనధికార కట్టడాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తహసీల్దార్ ఎం.మెరికమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో అనధికారంగా నిర్మించుకున్న పక్కా ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 30 విడుదల చేసిందన్నారు.దీని ప్రకారం 2019 అక్టోబర్ 15 తేదీ కంటే ముందుగా ప్రభుత్వ స్థలాల్లో అనధికారంగా నిర్మించుకున్న పక్కా ఇళ్లను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. వీరంతా వారి ఇంటి పన్ను, కరెంటు బిల్లులతో తమ వార్డు గ్రామ సచివాలయంలోని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.150 చదరపు గజాల్లో నిర్మించిన ఇంటిని ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని వెల్లడించారు. సచివాలయానికి వచ్చిన దరఖాస్తులు మండల కమిటీ, డివిజనల్ కమిటీ పరిశీలించి క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపవద్దు


బుర్రకథ కళాకారులతో వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బంది

నిడదవోలు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవి కళా బృందం సభ్యులు శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ బుర్రకథను ప్రదర్శించారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ, వ్యాధి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలు వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు లేకుండా సమాజంలో కలసి ఎలా జీవించాలని వివరించారు.పలు అంశాలపై కళాకారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అహ్మద్, గుడ్ లాంప్ ప్రాజెక్ట్ మేనేజర్ ఏఈఓ మూర్తి, వెంకటేశ్వరి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా, జైలు

కంబాలచెరువు: మద్యం తాగి వాహనం నడుపుతున్న 27 మందిపై రాజమహేంద్రవరం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని జైలుకి పంపారు. ఈ మేరకు మూడో ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య శుక్రవారం తీర్పు వెలువరించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి ట్రాఫిక్ డీఎస్పీ కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా మొత్తం 22 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజులు, మరో ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి ఒక్కరోజు జైలు శిక్ష విధించారు.

బిషప్ థామస్‌కు పీస్ అంబాసిడర్ అవార్డు



సీటీఆర్ఐ: దహించు అగ్ని వ్యవస్థాపకుడు బిషప్ డాక్టర్ థామస్‌కు ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ (అమెరికా) అవార్డు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ శిశు,సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. థామస్‌కు అవార్డు లభించిన సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరంలోని దహించు అగ్ని ఆడిటోరియంలో ఆయన మాతృమూర్తి దివంగత మేరీ సెల్వం జ్ఞాపకార్థం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నగరంలోని పది మంది ప్రముఖ వైద్యులు ఈ శిబిరానికి హాజరై రోగులకు వైద్య సేవలు అందించారు. రూ.లక్ష విలువైన మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా థామస్ విలేకరులతో మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా పేదలకు అనేక రకాల సేవలు అందిస్తున్నానన్నారు. వాటికి గుర్తింపుగా 139 దేశాలలో గుర్తింపు కలిగిన అమెరికన్ సంస్థ తనకు ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డు ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు. యువకులకు వృత్తి, విద్య నైపుణ్యంలో శిక్షణ, పదివేల మంది క్రైస్తవులకు తర్ఫీదు ఇచ్చామన్నారు.వితంతువులకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ యువకులు రక్తదానం చేశారన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడు?

- సచివాలయాల చుట్టూ వృద్ధులు, వితంతువుల ప్రదక్షిణ
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా పట్టించుకోని వైనం
- ఇప్పటికీ ప్రారంభం కాని దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

చాగల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అవుతున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేసిన దాఖలాల్లేవు. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో పలువురు అర్హులు ఎప్పుడు పింఛన్ మంజూరు చేస్తారంటూ సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరిలో పింఛన్ల మంజూరు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు ఆ పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారు. వివిధ సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. చాగల్లు మండలంలో ప్రస్తుతం 9,191 మంది సామాజిక పెన్షన్‌దారులు ఉన్నారు.


వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

అమలు కాని ఎన్నికల హామీ

ఎన్నికల సమయంలో కూటమి సర్కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామనిహామీ ఇచ్చింది. ఇంత వరకు దీనిని ఆచరణలో పెట్టలేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తుందో కూడా ప్రకటించలేదు. మండలంలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో మొత్తం 13 పంచాయతీలు, 18 సచివాలయాలున్నాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మాత్రం కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తున్నారు. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని వారికి సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. నేడు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం పెన్షన్‌కు సంబంధించి వెబ్‌సైట్ నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్‌దారులకు ఇంటి వద్దే పింఛన్ అందించేవారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. అదే విధంగా ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం పింఛన్ మంజూరు చేయమని అర్జీలు అందిస్తున్నారు.



చాగల్లు మండలం కలవలపల్లి సచివాలయం

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

నా భర్త బాపేశ్వరరావు గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. గతేడాది కాలంగా వితంతు పింఛన్ మంజూరు కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నాను. నేటికీ పింఛన్ మంజూరు కాలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాను.

– వి.కుమారి, చాగల్లు

దరఖాస్తుకు అవకాశం లేదు

సామాజిక పింఛన్‌దారుడు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. వెబ్‌సైట్ తెరుచుకుంటే అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఆర్. శ్రీదేవి, ఎంపీడీఓ,

నైట్ పెట్రోలింగ్‌తో సమయపాలన

నిడదవోలు : నిడదవోలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలకు అనుగుణంగా పనిచేసే విధంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్, ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా నిడదవోలు ఎక్సైజ్ నిడదవోలు స్టేషన్ సిబ్బంది ఒక్కరికీ 3 నుంచి 4 షాపులు కేటాయించారన్నారు. నిడదవోలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణలో సమయపాలన, మద్యం లూజు విక్రయాలు, ఎంఆర్పీకే మద్యం అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. రికార్డుల సక్రమ నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించడం, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి నిబంధనలు కచ్చితంగా అమలయ్యే పర్యవేక్షిస్తామన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పాల్గొని సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారని తెలిపారు. నిబంధన ఉల్లంఘిస్తే మద్యం దుకాణం, బార్ అండ్ రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సతీష్‌బాబు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నిడదవోలు: పట్టణంలోని మంత్రి దుర్గేష్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ చికిత్స పొందిన 34 మంది బాధిత కుటుంబాలకు రూ.16.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కందుల దుర్గేష్ అనారోగ్యం కారణంగా రాలేకపోయారు. బాధితులు ఇబ్బందులు పడకుండా మంత్రి దుర్గేష్ ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం


నందింగంపాడులో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ రాంబాబు

చాగల్లు: గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని నందింగపాడు సర్పంచ్ కుడప రాంబాబు అన్నారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం సక్రమ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా ప్రతిస్పందన సర్వేలో జిల్లాలో నందిగంపాడుకు ప్రథమ స్థానం వచ్చిన సందర్భంగా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీషా మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన పారిశుధ్యం అందించడంలో సర్పంచ్ రాంబాబు కృషి, సహకారం అభినందనీయమని అన్నారు. గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి అంకితభావంతో పని చేద్దాం

- కలెక్టర్ ప్రశాంతి
- ఉత్సాహంగా అవార్డుల ప్రదానోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, కలిసికట్టుగా కార్పొరేషన్‌ను ప్రగతిపథంలో పయనింపజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గాదాలమ్మ గుడి రోడ్డులోని బీవీఆర్ శ్రీకన్వెన్షన్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వార్షికోత్సవ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి ఇటువంటి కార్యక్రమాలు ఆటవిడుపు, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ అవార్డులతో ఉద్యోగులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. దూరదృష్టి, అపారమైన అనుభవంతో ఓవైపు యంత్రాంగానికి మార్గదర్శకత్వం వహిస్తూ, ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కమిషనర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అధికారులు, ఉద్యోగులందరూ సందడి చేశారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉద్యోగుల్లో నూతన ఉత్తేజం

కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందిని ఈ వేదిక ద్వారా సత్కరించుకోవటం సంతోషదాయకమన్నారు. ఈ అవార్డులు ఉద్యోగులలో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు వారిపై బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులను మెమెంటోలు, ప్రశంసాపత్రాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఆర్డీఓ కృష్ణ నాయక్, ఆర్డీఎంఏ నాగ నరసింహారావు, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్), ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.


నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇసుక మాఫియా అరాచకాలను అరికట్టాలి

ప్రకాశం నగర్: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపునకు పాల్పడుతున్న ఇసుక మాఫియా అరాచకాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇసుక తరలింపు సమయంలో రోడ్డుపైన ఇసుక పడి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అయినా ఇసుక మాఫియా ఆగడాలు తగ్గడం లేదన్నారు. ఇటీవల ధవళేశ్వరంలో కానిస్టేబుల్ కుమార్తెను ఎక్కించుకుని వెళుతూ జారిపడి ప్రాణాలు కోల్పోయారని, అదే ధవళేశ్వరంలో సాయిబాబా గుడి వద్ద యువకుడు ఇసుకలో జారిపడటం వెనుక నుంచి వచ్చిన లారీ ఎక్కడంతో మృతివాత పడ్డాడన్నారు. కలెక్టర్ ఆదేశాలను కూడా బేఖాతరు చేసి ఇసుకు తొడుకుపోతున్నారని విమర్శించారు. తక్షణమే ఉన్నత అధికారులు ప్రభుత్వం స్పందించి ఇసుక మాఫియా ఆగడాలను, అరాచకాలను అరికట్టాలన్నారు.

ఆన్‌లైన్ యోగాను సద్వినియోగం చేసుకోవాలి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహిస్తున్న యోగాంధ్ర ప్రోగ్రామ్‌ను క్యాంపస్‌తో పాటు గోదావరి జిల్లాలలో అనుబంధంగా ఉన్న కళాశాలలు సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. కానవరంలోని రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ ఉచిత ఆన్‌లైన్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మే 21 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 21 వరకు జరుగుతుంది.

నెల రోజుల పాటు యోగా శిక్షణ

సీటీఆర్ఐ: రాబోవు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెల రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. యోగా ఫర్ వన్ ఎర్త్, ఫర్ హెల్త్ ఇతివృత్తంతో యోగాంధ్ర 2025 పేరిట ఒక నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సుమారు 300 మందికి యోగాలో శిక్షణ, జిల్లా వ్యాప్తంగా వివిధ రకాలైన పోటీలు నిర్వహించడం, యోగా పాటల పోటీలు, సైకిల్ ర్యాలీ లాంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పీఏ కిషోర్ బాబు, డాక్టర్ డీవీ రమణమూర్తి, జి.శరత్ బాబు, డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.


యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

గొల్లగూడెం మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- అదుపు తప్పుతున్న వాహనాలు
- ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న ప్రజలు, వాహనదారులు
- స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజల విజ్ఞప్తి

దేవరపల్లి: దేవరపల్లి–గోపాలపురం జాతీయ రహదారిలో గొల్లగూడెం వద్ద గల ప్రమాదకర మలుపు నిత్యం నిండు ప్రాణాలను బలిగొంటోంది. రహదారిలో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. గ్రామంలో నుంచి రహదారిపైకి వచ్చే అంతర్గత రోడ్డు జాతీయ రహదారికి మలుపు వద్ద అనుసంధానం చేశారు. అంతర్గత రోడ్డులో నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే సమయంలో రహదారిపై వెళుతున్న భారీ వాహనాలు అదుపు తప్పి వాహనదారులను ఢీ కొంటున్నాయి. ప్రతి రోజు మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అంతర్గత రోడ్డులో నుంచి జాతీయ రహదారిపైకి మోటార్ సైకిళ్లపై వచ్చే వారికి జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపునకు ఎడమ వైపున చెరువు, కుడి వైపున గ్రామంలోకి వెళ్లడానికి రోడ్డు ఉండడం వల్ల ఇక్కడ భారీ వాహనాలు అదుపుతప్పి ఇళ్లల్లోకి దూసుకుపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు.


దేవరపల్లి-గోపాలపురం జాతీయ రహదారిలో గొల్లగూడెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

విషాదాన్ని మిగిల్చిన ప్రమాదాలు

ఈ మలుపు వద్ద 2011లో హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళుతున్న భారీ వాహనం అదుపు తప్పి తెల్లవారు జామున రోడ్డు పక్కన గల ఇంటిలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇంటిలో నిద్రిస్తున్న మహిళ దుర్మరణం చెందింది. 2023 ఫిబ్రవరి 5న గోపాలపురం వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న లారీ మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన గల ఇంటిలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పాశం కృష్ణారావుకు చెందిన ఇల్లు ధ్వంసం కాగా, ఇంటిలోని వస్తువులు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ నెల 15న గ్రామానికి చెందిన ఈరోతు జయకృష్ణ(35) ఇంటి నుంచి గోపాలపురం బైక్‌పై వెళుతుండగా మలుపు వద్ద అతివేగంగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో జయకృష్ణ అక్కడకక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే సమయంలో మలుపు వద్ద గల డ్రింక్ షాపు వద్ద ఆగి ఉన్న ప్రయాణికుల ఆటోను లారీ ఢీ కొనడంతో ఆటోలో ఉన్న ముగ్గురూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ విధంగా మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మంగళవారం రాత్రి దేవరపల్లి వైపు నుంచి గోపాలపురం వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి పక్కన గల పొగాకు బ్యారన్‌పై బోల్తాపడింది. రోడ్డు పక్కన గల ప్రజలు ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఈ రహదారి తల్లాడ–దేవరపల్లి జాతీయ రహదారి కావడంతో భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటోంది. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు దగ్గర మార్గం కావడంతో భారీ వాహనాలు ఎక్కువగా ఈ రహదారిలో వెళుతున్నాయి. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2021–22లో ఈ రహదారిని జాతీయ రహదారిగా మార్పు చేసి దేవరపల్లి నుంచి అశ్వారావుపేట వరకు రెండు వరుసలుగా విస్తరించారు. ఆ సమయంలో మలుపును సరిచేసి రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపు వద్ద ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలబారి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన గల ఇంటిలోకి దూసుకు వెళ్లిన లారీ (ఫైల్)


మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడిన లారీ (ఫైల్)

దిలీప్ కుమార్‌కు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు



కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న బి.దిలీప్ కుమార్.. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అందజేసే ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ వివరాలను క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖలో దిలీప్ కుమార్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో దిలీప్ కుమార్‌తో పాటు నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.చక్రధర్, చున్నీలాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.సీతామహాలక్ష్మిలకు అవార్డు ప్రదానం చేస్తామన్నారు.